ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 9-14

# అవధానం - పరిచయం

**డా.జి. వీరయ్య**

తెలుగు ఉపన్యాసకుడు

SKR&SKR ప్రభుత్వ మహిళా కళాశాల, కడప.

**ఉపోద్ఘాతం:**

అవధానం ఒక గొప్ప కళ ' ఇది అందరికి సాధ్యపడదు. దీని సాధనకు అద్భుతమైన ధారణ శక్తి, పాండిత్యం,నిత్య సాహిత్య సాధన, సాహితీ పఠనం, సృజనాత్మకత, చమత్కార కవిత్వం , ఏకాగ్రత, శ్రద్ధ, వాక్చాతుర్యం ఉండాలి. పృచ్ఛకులు అడిగే ప్రశ్నలకు చిరాకు పడకుండా శ్రద్ధగా విని వారు అడిగినప్పుడు అత్యంత ప్రతిభావంతంగా, సృజనాత్మకంగా, కళాత్మకంగా చమత్కారంగా, రసవంతంగా, సాహితీ పాండిత్య పటిమతో, సభికులకు ఆనందాన్ని కలిగించే విధంగా ఆశు కవితా ప్రతిభతో పద్య కల్పనా చాతుర్యం ప్రదర్శించాలి .

అవధానం అనగా అటెన్షన్ అని అర్థం. అనేక అంశాల పైన ఏకకాలంలో శ్రద్ధతో దృష్టిని కేంద్రీకరించి పృచ్ఛకులు లేదా ఉద్దీపకులు సంధించు చిత్ర విచిత్ర సాహితీ సంబంధ ప్రశ్నలకు, సమస్యా పూర్ణలకు అత్యంత చాకచక్యంగా, చమత్కారంగా, సమయ సందర్భానుకూలంగా ఆశుకవితా ప్రతిభను ప్రదర్శించడాన్ని అవధానం అని అంటారు.

అవధానం అనేది తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట ప్రక్రియ. సంస్కృతం, తెలుగు కాకుండా వేరే ఏభాషలోనూ ఈ ప్రక్రియ ఉన్నట్లు కనపడదు. “అవధానం అంటే అత్యంత సంక్లిష్టమైన సాహితీ సమస్యలను అవలీలగా పరిష్కరిస్తూ, చమత్కార పూరణలను ముగ్ధ మనోహరంగా పూరిస్తూ, అసంబద్ధ, అసందర్భ ప్రశ్నలను ఏక కాలంలో సమర్ధంగా ఎదుర్కొంటూ, ఆశువుగా పద్యాలు చెప్తూ అవధాని చేసే సాహితీ విన్యాసమే అవధానం”. అని డా. సురేష్ శర్మ రచించిన 'అవధాన ప్రక్రియ' అనే గ్రంథంలో అభివ్యక్తీకరించెను . అవధాని ఛందశ్శాస్త్రంలో ప్రవీణుడై వృత్తాలు, జాతులు, ఉపజాతులలోని పద్యలక్షణాలను ఔపోసన పట్టి ఉండాలి. పద్యాలు చెబుతున్నప్పుడు గణాలు, యతులు, ప్రాసలు అవంతట అవే వాటి స్థానాలలో వచ్చి కుదురుకోవాలి.

**కీలక పదాలు:** అవధానం, సాహిత్య సాధన, సాహితీ పఠనం, సందర్భానుకూలంగా, గణాలు, యతులు, ప్రాసలు

## అవధాన స్వరూపం:

కవి యొక్క ఆశుకవితాశక్తికి, సాహితీ పటిమకి, పాండిత్యానికి, ధారణా శక్తికి (గుర్తుంచుకోగల శక్తి) అత్యున్నత పరీక్షయే అవధానం. "అవధాని తన నిచ్చల బుద్ధి కుశలతతో, స్ఫూహతో , గ్రహణ శక్తితో , ఏకాగ్రతతో , ధారణాశక్తితో , పృచ్ఛకుల మనోభావాలను పసిగట్టి వారు సంధించిన సమస్యాత్మక ప్రశ్నలను , ఉద్దీపనలను దృఢ సంకల్పంతో ఏక కాలంలో ఎదుర్కొనే ఆశు కవితా సమరమే అవధానం " అని వేపచెట్టు రోశయ్య రచించిన 'ఆశు కవితాసమరం ' అనే గ్రంథంలో ప్రస్తావించారు. సాంప్రదాయికంగా జరిగే అష్టావధానంలో 8 మంది పృఛ్చకులు ఉంటారు. పృఛ్చకులు అనగా ప్రశ్నలు అడిగేవారు. ఈ పృఛ్చకులు

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 9-14

కూడా పాండిత్య పరంగా ఉద్ధండులైన వారే ఉంటారు. ఈ 8 మంది పృఛ్చకులు అవధాని చుట్టూ చేరి అవధాని పాండిత్యాన్ని మరియు సహనాన్ని పరీక్షించడానికి, వివిధ రకాలైన చిక్కు ప్రశ్నలు అడుగుతూ ఉంటారు. వీటన్నిటిని అత్యంత చాకచక్యంగా ఎదుర్కొంటూ అవధాని చేసే సాహితీ విన్యాసమే అవధానం. అవధానం విజయవంతంగా చేసిన వారిని అవధాని అని అంటారు. ఏకకాలంలో తెలుగు, సంస్కృతం రెండు భాషల లోనూ అవధానం చేసిన పండితులు ఉన్నారు.

**అవధానంలో రకాలు :**

అవధానాలు చాలా రకాలు. ముఖ్యంగా అవధానాలను వేదసంబంధ అవధానాలు, సాహిత్య సంబంధ అవధానాలు, సాహిత్యేతర అవధానాలుగా వర్గీకరించవచ్చు.

వేదసంబంధ అవధానాలు: స్వరావధానం, అక్షరావధానం .

సాహిత్య అవధానాలు: అష్టావధానం, శతావధానం, సహస్రావధానం... ఇలా 20 దాకా ఉన్నాయి.

సాహిత్యేతర అవధానాలు: శతకలశావధానం, శబ్దావధానం, రామాయణ, భగవద్గీత అవధానాలు. ఇవి ధారణ సంబంధమైనవి. అంటే ఒక్కసారి చదివి లేదా విని గుర్తుంచుకోవడం ద్వారా మళ్లీ చెప్పేవి.

సాంకేతిక అవధానాలు: నేత్రావధానం, అంగుష్ఠావధానం మొదలగునవి.

శాస్త్ర సంబంధ అవధానాలు: గణితావధానం, జ్యోతిష్యావధానం, వైద్యావధానం, అక్షరగణితావధానం .

కళా సంబంధ అవధానాలు: చిత్రకళావధానం, నాట్యావధానం, సంగీత అష్టావధానం, చతురంగావధానం, ధ్వన్యావధానం

**సంగీత అష్టావధానం:** ఎనిమిది మంది పృఛ్చకులు ఉంటారు. ఈ ఎనమిది మంది పృఛ్చకులకు, ప్రసిద్ధమైన ఇరవై పద్యాలను పన్నెండు రాగాలను ఇస్తారు. వాటిలో నుండి వారు కోరుకున్న రాగాలలో పద్యం పాడమని అడగవచ్చు. ఉదాహరణకు పాండవోద్యోగ వనంలోని జెండాపై కపిరాజు అనే పద్యం బహుళ ప్రచారంలో ఉంది. ఈ పద్యాన్ని ఇంతవరకు పాడిన గాయనీ గాయకులందరూ మోహనరాగం లోనే పాడారు. పరస్పర విరుద్ధమైన లక్షణాలు ఉన్న ఈ పద్యాన్ని శివరంజని రాగం లేదా ముల్తాన్ రాగంలో పాడమని పృఛ్చకులు అడిగితే అవధాని ఆ రాగంలోనే పద్యభావం చెడకుండా పాడాలి. పృచ్చకులు కూడా సంగీతం పట్ల వివిధ రకాల పట్ల అవగాహన కలిగి పద్యాలను రాగయుక్తంగా పాడగలవారై ఉంటారు. సంగీత అష్టావధానంలో ఒక్కొక్క పద్యాన్ని పరస్పర విరుద్ధమైన ఛాయలున్న రాగాలలో పద్య భావం చెడకండ అవధానుల ద్వారా విని ఆనందిస్తారు. ఈప్రక్రియను ప్రారంభించిన వారు మీగడ రామలింగస్వామి.

**అవధానంలో అంశాలు:**

అవధానంలో అనేక అంశాలు ఉంటాయి. ఒక్కొక్క అంశాన్ని ఒక్కొక్క పండితుడు నిర్వహిస్తాడు. అతడిని పృచ్చకుడు అని అంటారు. అవధాని పాండిత్యాన్ని, సమయస్ఫూర్తినీ పరీక్షిస్తూ తగు ప్రశ్నలను సంధిస్తూ ఉంటారు. ఈ అంశాలను స్థూలంగా నాలుగు వర్గాలుగా విభజించవచ్చు. అవి.ధారణా సహిత సాహిత్య సంబంధమైన అంశాలు: వర్ణన, సమస్యాపూరణ, దత్తపది, నిషిద్ధాక్షరి, నిషేధాక్షరి, నిర్దిష్టాక్షరి, వ్యస్తాక్షరి, చిత్రాక్షరి, లిఖితాక్షరి, ఇచ్చాంకశ్లోకము, శ్లోకాంధ్రీకరణము, ఏకసంథాగ్రహణం, వృత్తమాలిక, నిర్దిష్ట భావానువాదం మొదలైనవి.

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 9-14

ధారణా రహిత సాహిత్య సంబంధమైన అంశాలు: వచనకవిత, మినీకవిత, అంత్యాక్షరి, అక్షరవిన్యాసం ఆకాశపురాణం, ఆశువు, పురాణపఠనం, అప్రస్తుత ప్రసంగం, పాట, గేయం, చిత్రకథ, అన్యభాషోపన్యాసం కావ్యానుకరణం (పేరడీ), కావ్యోక్తి, ఛందోఃభాషణం, జావళి, కీర్తన, , నృత్తపది, ఇత్యాదులు.

ధారణా సహిత సాహిత్యేతర అంశాలు: పుష్పగణనం, ఘంటాగణనం, యాంత్రిక గణనం, నామసమీకరణం, మొదలైనవి.

ధారణా రహిత సాహిత్యేతర అంశాలు: సంగీతము, చదరంగము, పేకాట, అశ్వప్లుతం, వారగణనం, వంటివి.

**పురాణ పఠనం:**

వృచ్ఛకుడు పురాణం, ఇతిహాసం, ప్రబంధం, కావ్యం ఇలాంటి గ్రంథాలలోని ప్రధాన ఘట్టాలలో నుండి ఏదైనా ఒకటి రెండు పద్యాలను చదివి వినిపిస్తాడు. అవధానిగారు ఆ పద్యాలను విని ఆ పద్యాలు ఏ గ్రంథంలోనివి, ఆ గ్రంథ కర్త ఎవరు? ఆ సందర్భమేది వంటి విషయాలు పురాణ పక్కీలో చెప్పాలి . అవధాని గారు ఆ విషయాన్ని గురించి ఆలోచిస్తుండగా మరో వృచ్ఛకుడు మరో ప్రశ్న సందిస్తాడు. అవధాని అతన్ని 'కొంత సేపు ఆగు ' అని అనకుండా అతని ప్రశ్న వినడానికి సిద్ధపడాలి.

**అప్రస్తుత ప్రసంగం:**

పైన చెప్పిన సమస్యలు అవధాని గారి జ్ఞాపక శక్తిని, అతని ధారణా శక్తిని పరీక్షించేవి. అవధాని ఆయా విషయాల గురించి తీవ్రంగా అలోచిస్తూ వుండగా పృచ్ఛకులలో ఒకడైన ప్రస్తుత ప్రసంగి అవధాని యొక్క ఏకాగ్రతను చెడగొట్టడానికి రక రకాలైన కొంటె ప్రశ్నలను సంధిస్తుంటాడు. ప్రస్తుత విషయానికి పూర్తిగా విరుద్ధమైన కొంటె ప్రశ్నలు సందిస్తాడు. అవధాని ఏకాగ్రతను చెడగొట్టడానికి అప్రస్తుత ప్రసంగి చేయని ప్రయత్నం ఉండదు. ఉదాహరణకు ఒక సభలో ఒక అప్రస్తుత ప్రసంగి

"అవధాని గారూ, భర్త భోజనం చేస్తున్నాడు భార్య వడ్డిస్తోంది. భర్త పశువ అన్నాడు. భార్య కోతి అంది.వారి మాటల్లో ఆంతర్యమేమిటి" అని అడిగారు.

దానికి అవధాని... "పళ్లెం నిండా శుభ్రంగా వడ్డించవే" అని భర్త అంటే "కోరినంత తినండి" అని భార్య జవాబిచ్చింది అని చెప్పాడు. అంతటితో ఆ అప్రస్తుత ప్రసంగి ఆగకుండా "హనుమంతుని తోక పెద్దదా-ద్రౌపది కోక పెద్దదా" అని ప్రశ్నించాడు. అప్రస్తుత ప్రసంగి విసిరే ఛలోక్తులకు, చెణుకులకు అవధాని తడుముకోకుండా చెప్పగలిగితేనే సభ శోభిస్తుంది. ఎందుకంటే పద్య ఛందస్సుల గురించి తెలియని వారిని ఆకట్టుకునేది ఈ అప్రస్తుత ప్రసంగమే.

**వ్యస్తాక్షరి:**

ఇది ధారణకు సంబంధించిన అంశము. ఈ అంశంలో ఒక వాక్యం లేదా పద్యంలోని అక్షరాలు లేదా పదాలకు అంకెలు వేసి వాటిని వేరువేరుగా కత్తిరించి వాటికి క్రమము తప్పించి అవధానము జరుగుతున్నప్పుడు మధ్యమధ్యలో అవధానికి అందిస్తారు. అవధాని ఆ కాగితపు ముక్కలో ఉన్న అక్షరాన్ని లేదా పదాన్ని చదివి గుర్తు పెట్టుకుని ఆ కాగితపు ముక్కలను పక్కకు పడవేస్తాడు. అవధానం చివరలో ఆ అక్షరాలను/పదాలను క్రమంలో పేర్చి వాక్యాన్ని/పద్యాన్ని అప్పజెప్పుతాడు. ఈ అంశంలో అవధానులు తెలుగు భాష మాత్రమే కాక

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 9-14

సంస్కృతం,ఇంగ్లీషు, అరవం, హిందీ తదితర భాషా వాక్యాలను కూడా అప్పజెప్పుతారు. మాడభూషి వేంకటాచార్యులు ఈ అంశాన్ని ఎనిమిది భాషలలో చేశాడు.

**ఛందోభాషణం:**

ఈ అంశంలో పృచ్ఛకుడు, అవధాని పద్యాలలో సంభాషిస్తారు. పృచ్ఛకుడు ప్రశ్నను ఒక పద్యంలో కాని ఒక పద్య భాగంలో కాని అడిగితే అవధాని సమాధానాన్ని ఆ పద్యం మిగిలిన భాగాన్ని పూర్తి చేస్తాడు.

**అవధాన క్రమం:**

1.ఇప్పటి వరకు ఒక ఆవృతం మాత్రమే పూర్తయింది. ఏ ఒక్కరికీ పూర్తి సమాధానం ఇవ్వకనే మరో వృచ్ఛకుడు అడ్డు తగిలాడు. ఈ సారి రెండో ఆవృతంలో (రెండో రౌండు) తిరిగి మొదటి వృచ్ఛకుడు నాప్రశ్నకు సమాధానమేది అని ప్రశ్నిస్తాడు. అతనడిగిన ప్రశ్నేమిటో ఎంతవరకు సమాధాన మిచ్చాడో గుర్తు పెట్టుకొని ఆ పద్యంలో రెండో పాదం చెప్పాలి. మొదటి వృచ్ఛకుని సమాధానం పూర్తి కాక ముందే రెండో వృచ్ఛకుడు నాసంగతేమిటని అడుగుతాడు. అతనికి ఇంతకు ముందు ఎంతవరకు సమాధానము చేప్పారో గుర్తు పెట్టుకొని మిగతా సమాధాన భాగాన్ని పూరిచి చెప్పాలి. ఇంతలో మూడో పృచ్ఛకుడు ఇలాఒకరి తర్వాత మరొకరు తాము ఇదివరకు సంధించిన ప్రశ్నలు చెప్పకుండా తమకు రావలసిన సమాధానలను గురించే అడుగుతారు. అవధాని మీకు ఎంత వరకు సమాధానము చెప్పాను? అని అడగకుండా ఆ విషయాన్ని గుర్తించుకొని తరువాతి పద్య పాదాన్ని పూరించి సమాధానము చెప్పాలి. ఆ విధంగా నాలుగో రౌండులో మాత్రమే ప్రతి వృచ్ఛకునికి పూర్తి సమాధానము వస్తుంది. అవధానులెవరైనా వృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు చంధోబద్ధమైన పద్యాలతో సమాధానము చెప్పడమే కాదు ఆ సమాధానాలు అత్యంత రసవత్తరంగా, మనోజ్ఞంగా. సాధారణ ప్రేక్షకులను సైతం ఆకట్టుకునే విధంగా వుటాయి. అందులోనే అవధాని గారి గొప్పతనం, ప్రజ్ఞా వుంటాయి.

ఆ విధంగా అన్ని నియమాలతో పద్యాలు చెప్పడం ఒక ఎత్తైతే నాలుగు రౌండ్లు పూర్తవగానే ఆ పద్యాలన్నిటినీ ధారణ చేసి అదే క్రమంలో ఏకధాటిగా వాటిని పద్య రూపంలో చెప్పడం మరొ ఎత్తు. ఇదే ఈ అవధాన కార్యక్రమంలో గొప్పవిషయం. అలా అష్టావధాన కార్యక్రమం చాల కోలాహలంగా ఆనంద భరితంగా ముగుస్తుంది.

సమస్యా పూరణం: సమంజసము కానీ విషయాలను సమస్యలుగా ఇచ్చి పరిష్కరించమని చెప్పటాన్ని సమస్య పూరణం అంటారు. అంటే అసమంజసమైన విషయాలపై పృఛ్ఛకుడు ప్రశ్నలు అడుగుట

కప్పను జూడంగ పాము గజగజ లాడెన్

అనే పద్య పాదాన్ని పూర్వం పృఛ్ఛకుడు ఒక సమస్యగా ఇచ్చారు. ఇది అసమంజసమైనది. ఎందుకంటే కప్పను చూడగా పాము గజగజ లాడి భయపడు. అక్షరాలను ఏమాత్రము మార్చకుండా ఆ అర్థాన్ని మార్పు చేస్తూ పూరించాలని పృఛ్ఛకుడు అవధాని గారికి సమస్యని ఇచ్చాడు. దానికి అవధాని గారు ప్రతిస్పందిస్తూ

"వెంకప్పను జూడగా పాము గజగజలాడెన్" అని పద్యాన్ని పూరించి సభికులను అబ్బురపరిచాడు .

ఈ పద్యానికి భావం ఏమంటే వెంకప్ప అనే రైతు తన పొలం వద్ద నున్న కుప్పలకు కావలికై వెళుతూ ఒక కర్రను, కిర్రు చెప్పులును ధరించి వెళుతుంటే అతన్ని చూసి అనగా వెంకప్పను జూడంగ పాము గజగజ లాడెన్. ఈ సమస్య ఎంత అద్భుతంగా పూరించాడు.

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 9-14

**పువ్వులు విసురుట:** అవధాన కార్యక్రమము జరుగుతుండగా ఒకరు అవధాని పైకి అప్పుడప్పుడు ఒక్క పువ్వును విసురు తాడు. అవధానం పూర్తి కాగానే తనపైకి ఎన్ని పువ్వులు విసిరారో గుర్తు పెట్టుకొని అవధాని కచ్చితమైన సమాధానం చెప్పాలి .

గంటలు కొట్టుట: అవధానం జరుగుతున్నప్పుడు ఒక పృచ్ఛకుడు గంట కొడుతుంటాడు. అవధానం పూర్తికాగానే అతను ఎన్ని గంటలు కొట్టాడో గుర్తు పెట్టుకొని అవధాని చెప్పాలి.

పువ్వులు విసరటం, గంటలు కొట్టటం అనే రెండు అంశాలు వుండవు. ఈ రెండింటిలో ఏదో ఒక్కటే వుంటుంది.

**అష్టావధానం:**

ఎనిమిది అంశములపై ఏకకాలంలో దృష్టిని కేంద్రీకరించి చేయు అవధానమే అష్టావధానం. అష్టావధానంలో ఎనిమిది ప్రక్రియలు ఒకేసారి చెయ్యాలి. కనీస సమయం నాలుగు గంటలు. సాధారణంగా కింది ప్రక్రియలను ఎన్నుకుంటారు.

1.కావ్య పాఠము 2. కవిత్వము 3. శాస్త్రార్థము 4. ఆకాశపురాణము 5. లోకాభిరామాయణము

6. వ్యస్తాక్షరి (లేదా) న్యస్తాక్షరి 7. చదరంగము 8. పుష్ప గణనము

ఇవే కాకుండా, వర్ణన, ఆశువు, నిషిద్ధాక్షరి, నిర్దిష్టాక్షరి, వివర్గాక్షరి, అప్రస్తుత ప్రసంగం, సమస్యాపూరణం, ఘంటా గణనం, పురాణ పఠనం, సహ పఠనం, దత్తపది, కావ్యోక్తి మొదలగు వాటిలో ఏవైనా ఎనిమిది ప్రక్రియలను ఎన్నుకుంటారు. చివరలో "ధారణ"తో అవధానం ముగుస్తుంది. ధారణ అనగా ఆ అవధానంలో తాను చెప్పిన అన్ని పద్యాలను అవధాని చివరలో చెప్పవలసి ఉంటుంది.

శతావధానం: వంద మంది పృచ్ఛకులను ఎదుర్కొని చేసే అవధానాన్ని శతావధానం అంటారు. సాధారణంగా శతావధానంలో సమస్య, దత్తాక్షరి, వర్ణన, అప్రస్తుత ప్రసంగం అంశాలు ఉంటాయి.

**దశావధానం:** దశావధానం అనగా అష్టావధానము వలే ఏక కాలమున విలక్షణములగు పది అంశములపై దృష్టిని కేంద్రీకరించి చేయు విద్యావినోదమే దశావధానం. "లేఖనాది పరికర సాహాయము లేకుండా ఏమాత్రం తడుముకోకుండా, ధారావాహికముగా, అడిగిన విషయమును గూర్చి చక్కటి ఛందోబద్ధ ఆశుకవితా రచనచేయుట" అని ఎ. ఝాన్సీ రాణి రచించిన 'వ్యాస సుధావళి' లో రాయబడి ఉంది.

శతఘంటావధానం: వివిధ ఆకృతులు, పరిమాణములూ గల 100 కంచు చెంబులపై సంఖ్యలు వేస్తారు. వాటిని అవధానికి కనబడకుండా వేరే గదిలో ఉంచి, ఒక్కొక్క చెంబు సంఖ్యను చెప్పి, ఒక కర్రతో కొడతారు. అప్పుడు శబ్దాన్ని విని అవధాని గుర్తు పెట్టుకోవాలి. అలా అన్ని చెంబులనూ సంఖ్య చెప్పి కర్రతో కొడతారు. ఆ తరువాత తన ఇష్టం వచ్చిన రీతిలో ఏదో ఒక చెంబును కొడతారు. అవధాని ఆ శబ్దాన్ని బట్టి ఆ చెంబు సంఖ్య ఎంతో చెప్పాలి. ఇది శత ఘంటావధానములో ముఖ్యమైన ప్రక్రియ.

**ఆధార గ్రంథాలు**

1. డా. బి. సురేష్ శర్మ -' అవధాన ప్రక్రియ' పుట. నెం. 3 ప్రతిభ పబ్లికేషన్స్, హైదరాబాద్
2. వేపచెట్టు రోశయ్య -'ఆశు కవితాసమరం' పుట. నెం. 126 కవితేజ పబ్లికేషన్స్, చెన్నై.
3.ఎ. ఝాన్సీ రాణి-'వ్యాస సుధావళి' పుట. నెం. 29 వెన్నెల పబ్లికేషన్స్, చెన్నై.

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 9-14